క్లుప్తంగా

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు



ఎస్ఎస్‌తాడ్వాయి: తాడ్వాయి–పస్రా మధ్యలోని లవ్వాల స్టేజీ సమీపంలోని మూలమలుపు వద్ద కారు చెట్టును ఢీకొట్టిన సంఘటనలో భరత్ అనే వ్యక్తి తీవ్ర గాయాలైన సంఘటన శనివారం చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి.. పస్రా నుంచి ఏటూరునాగారం వైపు వెళ్తున్న కారు మూలమలుపు వద్ద అదుపు తప్పి చెట్టును ఢీకొట్టింది. కారులో ఉన్న భరత్ తీవ్రంగా గాయపడ్డాడు. ప్రమాద ఘటన సమాచారం తెలుసుకున్న ఎస్సై శ్రీకాంత్‌రెడ్డి, ఏఎస్సై చింత నారాయణ, కానిస్టేబుల్ సాంబయ్య సంఘటన వద్దకు వెళ్లారు. గాయపడిన భరత్‌ను 108 అంబులెన్స్‌లో వైద్య చికిత్స కోసం ములుగులోని ప్రభుత్వ ఆస్పత్రి తరలించారు.

ఉపాధ్యాయుడి మృతి

- ఎంపీ ఎన్నికల విధులకు వెళ్లి గాయాలపాలైన మధుకుమార్


మధుకుమార్(ఫైల్)

ములుగు: ములుగు మండలం మధనపల్లికి చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు పోరిక మధుకుమార్ మృత్యువుతో పోరాడుతూ హైదరాబాద్‌లోని రిమ్స్ ఆస్పత్రిలో శనివారం తుదిశ్వాస విడిచారు. వివరాలు ఇలా ఉన్నాయి. మధుకుమార్ వెంకటాపురం(ఎం) మండలంలోని బూర్గుపేట ఆశ్రమ పాఠశాలలో హిందీ పండిట్‌గా విధులు నిర్వహిస్తూ పార్లమెంట్ ఎన్నికల విధులు నిర్వహించడానికి గత మే 12న భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు వెళ్లారు. స్నానానికి వెళ్లే క్రమంలో ఆకస్మాత్తుగా కిందపడి తలభాగానికి తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన తోటి ఉపాధ్యాయులు స్థానిక ఆస్పత్రికి అక్కడి నుంచి ఖమ్మం ఆస్పత్రికి తీసుకెళ్లారు. మెరుగైన వైద్యం కోసం బేగంపేటలోని కిమ్స్‌కు తరలించారు. అప్పటికే మధుకుమార్ కోమలోకి వెళ్లారు. అక్కడినుంచి రిమ్స్ ఆస్పత్రికి తరలించగా చికిత్సపొందుతూ మృతిచెందారు. మృతుడికి భార్య, కుమారుడు, కూతురు ఉన్నారు. నేడు తన స్వగ్రామం మదనపల్లిలో అంత్యక్రియలు చేపట్టేందుకు కుటుంబ సభ్యులు ఏర్పాట్లు చేస్తున్నారు. కాగా, ఆస్పత్రి ఖర్చులు రూ.20లక్షల వరకు అయ్యాయని బంధువులు తెలిపారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి..

రేగొండ: చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి చెందిన సంఘటన మండలంలోని తిరుమలగిరిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిసిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని తిరుమలగిరి గ్రామానికి చెందిన కోరె కట్టయ్య (65) మండల కేంద్రానికి వచ్చి తిరిగి తిరుమలగిరికి నడుచుకుంటూ వెళ్తుండగా ద్విచక్ర వాహనం అతడిని ఢీకొట్టింది. దీంతో అతడికి తలకు తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం వరంగల్ ఎంజీఎంకు తరలించారు. చికిత్స పొందుతూ శుక్రవారం రాత్రి మృతి చెందాడు. మృతుడి బంధువు మడక ఓదెలు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రవికుమార్ తెలిపారు.

విద్యుదాఘాతంతో ఎద్దు మృతి



కాటారం: విద్యుదాఘాతంతో ఎద్దు మృతి చెందిన సంఘటన శనివారం మండంలోని శంకరాంపల్లిలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం పెనుగొండ శ్రీనివాస్ అనే రైతుకు చెందిన ఎద్దు పశుగ్రాసం కోసం వెళ్లింది. ఈ క్రమంలో గ్రామంలోని ఓ విద్యుత్ స్తంభం వద్ద ఏర్పాటు చేసిన డీటీఆర్ ఎర్త్ వైరును ప్రమాదవశాత్తు తాకి షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందింది. ఎద్దు విలువ సుమారు రూ.70 వేల వరకు ఉంటుందని ప్రభుత్వం ఆర్థిక సాయం అందించి ఆదుకోవాలని బాధితుడు కోరారు.

మంగపేటలో పాడిగేదె..



మంగపేట: విద్యుదాఘాతంతో పాడి గేదె మృతి చెందన సంఘటన మండలంలోని కోమలిపల్లి గ్రామంలో శనివారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామంలోని పులి వెంకటయ్యకు చెందిన పాడిగేదె రోజు వారిలాగే పంట పొలాల్లోకి ఇతర పశువులతో కలిసి మేతకు వెళ్లింది. ఈ క్రమంలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ వద్ద ఎర్త్ వైర్‌కు తాకి షాక్ గురై అక్కడికక్కడే మృతి చెందిందని తెలిపారు. గేదె విలువ దాదాపు రూ.45 వేల వరకు ఉంటుందని అధికారులు బాధ్యత వహించి నష్ట పరిహారం ఇప్పించాలని బాధిత రైతు కోరారు.

రోడ్డుపైనే వర్షపు నీరు

- డ్రెయినేజీలు లేక నిలుస్తున్న వైనం
- ధ్వంసమవుతున్న రహదారి
- పట్టించుకోని అధికారులు


మల్లూరు బస్టాప్ వద్ద రోడ్డుపై నిలిచి ఉన్న వర్షపు నీరు

మంగపేట: మండలంలోని ఏటూరునాగారం–బూర్గంపాడు ప్రధాన రోడ్డుపై పలు గ్రామాల్లో వర్షపు నీరు నిలిచి ఉండటంతో రోడ్డు ధ్వంసమతోంది. మండలంలోని మల్లూరు, రమణక్కపేట, రాజుపేట గ్రామాల్లో ప్రధాన రోడ్డుకు ఇరువైపులా రోడ్డుకు ఐదు ఫీట్ల ఎత్తులో జనావాసాలు నిర్మించారు. దీంతో పాటు పూర్వం నుంచి ఉన్న తాత్కాలిక సైడ్ కాల్వలు కూడుకు పోవడంతో వర్షపునీరు రోడ్డుపైనే నిలిచి ఉంటున్నాయి. దీంతో వాహనాలు నీటిలోనుంచి వెళ్లడంతో నీళ్లు చిమ్మి రోడ్డు వెంట నడిచే వారిపై పడుతున్నాయి. ప్రధానంగా మల్లూరు బస్టాప్ ముందు భారీగా నీరు నిలిచి ఉండటంతో వాహనాల దాటికి రోడ్డుపై నిలిచిన నీరు బస్టాప్‌లోకి చిమ్మి పడుతున్నాయి. ఆర్అండ్‌బీ అధికారులు ముందే రోడ్డు పరిధిలో ఉండే స్థలంలో ఇంటి నిర్మాణాలు, కాల్వల్లో మట్టి నింపకుండా చర్యలు తీసుకుని ఉంటే ఇలాంటి సమస్య తలెత్తేది కాదని వారి నిర్లక్ష్యం కారణంగానే ఇలాంటి పరిస్థితి ఏర్పడిందని స్థానిక ప్రజలు ఆరోపిస్తున్నారు. కమలాపురం నుంచి జిల్లా సరిహద్దు వరకు ప్రధాన రోడ్డుకు ఇరువైపులా రోడ్డు పరిధిలో ఉన్న కాల్వలు సైతం సాగుకు అనుకూలంగా మార్చుతున్నా పట్టించుకోక పోవడం వెనుక అంతర్యం ఏమిటని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైన సంబంధిత అధికారులు స్పందించి రోడ్డుపై నిలిచి ఉండే నీరు బయటకు వెళ్లే విధంగా చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు. అలాగే ఆయా గ్రామాల్లో సైడ్ కాల్వలు నిర్మించేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

దేవుడిగుట్టలో వైద్యపరీక్షలు

గోవిందరావుపేట: మండల పరిధిలోని దేవుడిగుట్ట గొత్తికోయ గ్రామంలోని ప్రజలకు జిల్లా సీజనల్ వ్యాధి, టీబీ ప్రోగ్రాం ఆఫీసర్ డా.రవీందర్ పర్యవేక్షణలో పస్రా మెడికల్ ఆఫీసర్ డా.మధు ఆధ్వర్యంలో శనివారం వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా డా.మధు మాట్లాడుతూ.. గ్రామంలోని 22 మందికి వైద్య పరీక్షలు నిర్వహించగా ఎవరికి కూడా మలేరియా పాజిటివ్ రాలేదు అని అన్నారు. జిల్లాలోనే దేవుడిగుట్ట గొత్తికోయ గ్రామం మలేరియాకి కేంద్ర బిందువు అని, గ్రామంలో కొంత మంది రక్తహీనతతో బాధపడుతున్నారు అని అన్నారు. గ్రామస్తులు ఆరోగ్య సూత్రాలు వివరించి, హెల్త్ ఎడ్యుకేషన్ గూర్చి వివరించినట్లు పేర్కొన్నారు. హెల్త్ అసిస్టెంట్ నర్సింగరావు, ల్యాబ్ టెక్నిషియన్ నర్సింగరావు, హెల్త్ సూపర్‌వైజర్ పుష్ప, ఏఎన్ఎం సంపూర్ణ పాల్గొన్నారు.

ప్రైవేట్ పాఠశాలల్లో నిబంధనల ఉల్లంఘన

నర్సంపేట : మండలంలోని పలు ప్రైవేటు పాఠశాలల్లో ప్రభుత్వ నిబంధనలు యథేచ్ఛగా ఉల్లంఘిస్తున్నారని ఏఐఎఫ్‌డీఎస్ జిల్లా కార్యదర్శి జన్ను రమేశ్, డివిజన్ కార్యదర్శి మార్త నాగరాజు, ప్రజాసంఘాల నాయకుడు కొత్తకొండ రాజమౌళి ధ్వజమెత్తారు. సదరు పాఠశాలల యాజమాన్యాలపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని కోరుతూ ఆర్డీఓ కార్యాలయ ఏఓకు శనివారం వారు వినతిపత్రం అందజేశారు. అనంతరం రమేశ్, నాగరాజు, రాజమౌళి మాట్లాడారు. పలు ప్రైవేటు స్కూళ్లలో పాఠ్యపుస్తకాలు, యూనిఫామ్ విక్రయిస్తున్నారని తెలిపారు. అయినప్పటికీ విద్యాశాఖ అధికారులు చర్యలు తీసుకోవడం లేదన్నారు. వాహనాలకు ఫిట్‌నెస్ లేదని, అనర్హులను డ్రైవర్లుగా నియమించారని, స్కూళ్లలో మౌలిక వసతులూ లేవని ఆందోళన వెలిబుచ్చారు. ఇకనైనా ప్రభుత్వం, విద్యాశాఖ ఉన్నతాధికారులు స్పందించి ప్రైవేటు పాఠశాలల్లో తనిఖీ నిర్వహించి నిబంధనలు ఉల్లంఘిస్తున్న యాజమాన్యాలపై చర్యలు తీసుకోవడంతోపాటు అన్ని ప్రభుత్వ పాఠశాలల్లోనూ మౌలిక వసతులు కల్పించాలని, ఉపాధ్యాయ ఖాళీలను భర్తీ చేయాలని, ఇతర సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు కల్లెపల్లి రాకేశ్, కొత్తకొండ అజిత్, సాంబారి అజయ్, తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం డబ్బుల చెల్లింపులో మోసం


మాట్లాడుతున్న రైతులు

ఏటూరునాగారం: ఆరుగాలం కష్టించి పండించిన పంటను కొనుగోలు కేంద్రంలో ధాన్యం విక్రయిస్తే డబ్బుల చెల్లింపులో కొనుగోలు సెంటర్ నిర్వాహకుడు మోసం చేస్తున్నాడని రైతులు ఆరోపించారు. తాళ్లగడ్డలో ఏర్పాటు చేసిన ఏటూరునాగారం జీసీసీ కొనుగోలు కేంద్రంలో ధాన్యం విక్రయించిన రైతులు శనివారం మాట్లాడుతూ.. కొనుగోలు కేంద్రానికి గ్రామంలోని రైతులు ధాన్యాన్ని విక్రయించినట్లు తెలిపారు. అయితే కొనుగోలుదారుడు అయినా జీసీసీ ఉద్యోగి సాంబారావు అనే వ్యక్తి రైతుల ధాన్యాన్ని మిల్లులకు తరలించి ధాన్యం తూకాన్ని తక్కువ చూపిస్తూ రైతులకు రావాల్సిన మొత్తం డబ్బులో నుంచి రూ.10వేలు దోచుకుంటున్నాడని ఆరోపించారు. ఇలా సుమారు 40 మంది రైతుల వద్ద తరుగు ఉందని, తాలు ఉందని, తూకం తక్కువ వచ్చిందని, అమ్మిన బస్తాలకు ఇంతే వస్తుందని ఇలా రైతులకు కళ్లబొల్లి కబుర్లు చెబుతూ డబ్బులు కాజేస్తున్నట్లు వాపోయారు. కిరణ్ అనే వ్యక్తిని అసిస్టెంట్‌గా ఏర్పాటు చేసుకోని మిల్లర్ల నుంచి వచ్చే డబ్బును కిరణ్ ఖాతాలోకి తరలించి సోమ్ము చేసుకుంటున్నాడని తెలిపారు. జీసీసీ ఉద్యోగి అకౌంట్‌లో రూ.లక్షల రూపాయలు జమ ఎలా అవుతున్నాయని విచారణ జరిగితే సమస్య ఉంటుందని బినామీ అయినా కిరణ్ అకౌంట్‌కు నగదు తరలిస్తున్నారని పేర్కొన్నారు. కలెక్టర్ స్పందించి దీనిపై విచారణ చేపట్టాలని కోరారు. బాధిత రైతులు అంతటి దుర్గరాజు, గోగు మల్లయ్య, సునారికాని భిక్షపతి, కుమ్మరి శేఖర్, జాడి సమ్మయ్య, గోపి ఉన్నారు.

అనుమానితులు కనిపిస్తే సమాచారం ఇవ్వాలి


ప్రయాణికులతో మాట్లాడుతున్న ఎస్సై హరీష్

వాజేడు: మండల పరిధిలోని మండపాక గ్రామం వద్ద 163 నంబర్ జాతీయ రహదారిపై ఎస్సై రుద్రారపు హరీష్ ఆధ్వర్యంలో శనివారం పోలీసులు వాహన తనిఖీలను నిర్వహించారు. ప్రతీ వాహనాన్ని సోదాలు చేయడంతో పాటు ప్రయాణికుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనుమానితులు, కొత్త వ్యక్తులు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు.

ప్రతి ఇంటికి విద్యుత్ మీటరు బిగించుకోవాలి


ఎస్సీ కాలనీలో అవగాహన కల్పిస్తున్న ఏడీ రఘు

శాయంపేట : ప్రతి ఇంటికి విద్యుత్ శాఖ నుంచి అధికారికంగా అందజేస్తున్న విద్యుత్ మీటర్లను బిగించుకోవాలని ఆ శాఖ విజిలెన్స్ ఏడీ రఘు దళిత కాలనీవాసులకు సూచించారు. మండల కేంద్రంలోని దళిత కాలనీలోని కాలనీవాసులకు విద్యుత్ అధికారులతో కలిసి ఆయన విద్యుత్ మీటర్లపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏడీ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం 6 గ్యారంటీ పథకాల్లో భాగంగా 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందజేస్తుందన్నారు. దళిత, గిరిజన కాలనీవాసులు తమ ఇంటికి విద్యుత్ వినియోగం కోసం రూ.1080 చెల్లించి మీటరు బిగించుకోవాలని, జీరో కరెంట్ బిల్లు ప్రభుత్వమే భరిస్తుందన్నారు. ఇతర కులాలకు చెందిన వారు మీటర్ కోసం రూ.1850 చెల్లించాలని సూచించారు. విద్యుత్ మీటర్లు పెరిగినట్లయితే దానికి సరిపడా వోల్టేజ్ అందించడం కోసం అదనపు ట్రాన్స్‌ఫార్మర్లు బిగించడం జరుగుతుందన్నారు. మీటర్లు లేక విద్యుత్ వైర్లకు అనధికారికంగా విద్యుత్ వినియోగిస్తే విద్యుత్ ప్రమాదాల బారిన పడే ప్రమాదం ఉందని వారిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రతిఒక్కరూ విద్యుత్ శాఖకు సహకరించి ప్రతి ఇంటికి మీటర్లు బిగించుకొని అధికారికంగా విద్యుత్ వినియోగం చేసుకోవాలని కోరారు. వివిధ పార్టీలకు చెందిన నాయకులు కూడా సహకరించి మీటర్లు బిగించుకునేలా చూడాలని కోరారు. కార్యక్రమంలో విజిలెన్స్ ఏఈలు శ్రీధర్, శంకరయ్య, లైన్‌మెన్ సంతోష్, జేఎల్ఎం విష్ణు, హెల్పర్ అరుణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వర్షారణ్య పరిరక్షణ సామాజిక బాధ్యత


సమావేశంలో మాట్లాడుతున్న ప్రభాకర్

నర్సంపేట : వర్షారణ్య పరిరక్షణను సామాజిక బాధ్యతగా స్వయంకృషి సేవా సంస్థ ప్రతినిధి బెజ్జంకి ప్రభాకర్ అభివర్ణించారు. ప్రపంచ వర్షారణ్య దినోత్సవాన్ని పురస్కరించుకుని పట్టణంలోని ప్రభుత్వ బాలికల హైస్కూల్‌లో ఆ సంస్థ ఆధ్వర్యంలో ప్రధానోపాధ్యాయుడు కాంతారావు అధ్యక్షతన శనివారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ప్రభాకర్ మాట్లాడారు. అడవులు జీవవైవిద్యానికి నెలవులని చెప్పారు. భూగోళం ఉష్ణోగ్రతలను నియంత్రించడంలో కీలకమని తెలిపారు. అడవుల, సహజ వనరుల విధ్వంసం జరగకుండా చూడాల్సిన బాధ్యత సమాజంలోని ప్రతీఒక్కరిపైనా ఉందన్నారు. ప్రపంచంలోని వర్షారణ్యాలను రక్షించడం, ప్రోత్సహించడం కోసం ఏటా దినోత్సవం నిర్వహిస్తున్నట్టు చెప్పారు. 2017లో తొలిసారిగా ప్రపంచ రెయిన్ ఫారెస్ట్ డే (వర్షారణ్య దినోత్సవం) ఏటా జూన్ 22న నిర్వహించడం ఆనవాయితీగా వస్తోందని తెలిపారు. భూఉపరితలంలో ముడింట ఒక వంతు అడవులే ఉన్నాయన్నారు. అడవులంటే కేవలం పచ్చదనమే కాదని, పలు రకాల జీవ, జంతు జాతులకు ఆలవాలమని చెప్పారు. అడవులు వాతావరణంపై తీవ్ర ప్రభావం చూపిస్తాయని, వాతావరణ మార్పు కారణంగా పర్యావరణంలో మార్పు వస్తుందని వివరించారు. వాతావరణ సమతుల్యతను కాపాడడంలో అడవులు ముఖ్యపాత్ర పోషిస్తాయని తెలిపారు. కార్బన్ డయాక్సైడ్‌ను గ్రహించి ఆక్సిజన్‌ను అందించడం అడవులు, చెట్ల వల్లే జరుగుతుందని చెప్పారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు స్వామి, తదితరులు పాల్గొన్నారు.

రైతు సంక్షేమమే కాంగ్రెస్ ధ్యేయం


ములుగు: మాట్లాడుతున్న గొల్లపల్లి రాజేందర్‌గౌడ్

ములుగు: రైతు సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వం ధ్యేయమని ఏక కాలంలో పంట రుణమాఫీ చేసిన, చేయనున్న ఘనత కాంగ్రెస్‌కు దక్కుతుందని ఆ పార్టీ కిసాన్ జిల్లా అధ్యక్షుడు, నియోజకవర్గ కో ఆర్డినేటర్ గొల్లపల్లి రాజేందర్‌గౌడ్ అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. రుణమాఫీ చేయడానికి సీఎం రేవంత్‌రెడ్డి హాయంలో రాష్ట్ర కేబినెట్ తీసుకున్న నిర్ణయం గొప్ప విషయం అని అన్నారు. సీఎం, మంత్రి ధనసరి సీతక్కకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ధాన్యం కొనుగోలు విషయంలో రైతుల నుంచి తరుగు లేకుండా మిల్లర్లతో కొనుగోలు చేయించి కాంగ్రెస్ పార్టీ రైతులకు అండగా నిలబడిందని తెలిపారు. ఈ సమావేశంలో రాష్ట్ర, జిల్లా, మండల, గ్రామ నాయకులు, యూత్ నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.


వెంకటాపురం(కె): మాట్లాడుతున్న నాయకులు

వెంకటాపురం(కె): రైతు సంక్షేమమే కాంగ్రెస్ ధ్యేయమని మండల బ్లాక్ అధ్యక్షుడు చిడెం సాంబశివరావు(శివ) అన్నారు. శనివారం మండల కేంద్రంలోని ఆర్అండ్‌బీ అతిథి గృహం ఆవరణంలో మండల కాంగ్రెస్ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల ముందు రాహుల్ గాంధీ వరంగల్‌లో ప్రకటించిన రైతు డిక్లరేషన్‌లో భాగంగా రైతులకు ఏకకాలంలో రూ.రెండు లక్షల రుణమాఫీని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆమోదం తెలిపారని అన్నారు. రుణమాఫీ ప్రకటించడంపై హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు జల్లిగంపల కళాధర్, బాలసాని వేణు, ఎంపీటీసీలు గార్లపాటి రవి, కొండపర్తి సీతదేవి, కిరణ్, చిట్టెం వాసు, భూషణం, దేవాసహాయం తదితరులు ఉన్నారు.

స్పోర్ట్స్ స్కూళ్లలో ప్రవేశాలకు ఆహ్వానం

టేకుమట్ల/రేగొండ/మొగుళ్లపల్లి: స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ ఆధ్వర్యంలో హకీంపేట, కరీంనగర్, ఆదిలాబాద్ స్పోర్ట్స్ స్కూళ్లలో 4వ తరగతిలో ప్రవేశాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు టేకుమట్ల మండల వైద్యాధికారి కోడెపాక రఘుపతి, రేగొండ, మొగుళ్లపల్లి మండల విద్యాధికారి వేల్పుల ప్రభాకర్ శనివారం వేర్వేరు ప్రకటనల్లో తెలిపారు. ఈ నెల 25న ఆయా మండల కేంద్రాల్లో ఉన్నత పాఠశాలల్లో మండల స్థాయి ఎంపికలు నిర్వహిస్తారని, మండల స్థాయిలో ప్రతిభ కనబర్చిన విద్యార్థులు జిల్లా, రాష్ట్రస్థాయి క్రీడల్లో పాల్గొనాలని తెలిపారు. ఆసక్తి గల 9సంవత్సరాల లోపు విద్యార్థులు స్టడీ, బర్త్ సర్టిఫికేట్, 3వ తరగతి ప్రోగ్రెస్ రిపోర్ట్, ఆధార్ కార్డు, కులం సర్టిఫికేట్, పాస్ ఫొటోలతో క్రీడల ఎంపికకు రావాలన్నారు. మరిన్ని వివరాలకు టేకుమట్ల మండల విద్యార్థులు 98669 21820, రేగొండ మండల విద్యార్థులు 98486 20279, మొగుళ్లపల్లి మండల విద్యార్థులు 98481 90566 నంబర్‌లో సంప్రదించాలన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

కన్నాయిగూడెం: మండలంలోని కన్నాయిగూడెం, ఏటూరు సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాలకు నేడు (ఆదివారం) విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్ ఏఈ స్వామి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మరమ్మత్తుల కారణంగా ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు నిలిపివేస్తున్నట్లు తెలిపారు. మండల ప్రజలు సహకరించాలని కోరారు.

రేపు మండల సర్వసభ్య సమావేశం

మల్హర్: మండల కేంద్రం తాడిచర్ల ఎంపీడీఓ కార్యాలయంలో రేపు (సోమవారం) మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ శ్యామ్ సుందర్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 11గంటలకు నిర్వహించే సమావేశానికి ఎంపీటీసీలు, గ్రామ పంచా యతీ ప్రత్యేక అధికారులు, వివిధ శాఖల అధి కారులు సకాలంలో హాజరు కావాలని కోరారు.

రాష్ట్రంలో ఆదివాసీలకు రక్షణ కరువు


మాట్లాడుతున్న శ్రావణ్‌కుమార్

మంగపేట: రాష్ట్రంలో ఆదివాసీలకు రక్షణ కరువైందని తుడుందెబ్బ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కబ్బాక శ్రావణ్‌కుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తొండ్యాల లక్ష్మీపురంలో ఆ సంఘం మండల ప్రధాన కార్యదర్శి ఆగబోయిన చంద్రకాంత్ అధ్యక్షతన అత్యవసర సమావేశం శనివారం నిర్వహించారు. సమావేశానికి శ్రావణ్‌కుమార్ హాజరై మాట్లాడారు. నాగర్‌కర్నూలు జిల్లా కొల్లాపూర్ మండలం మొలచింతలపల్లి గ్రామానికి చెందిన ఆదివాసీ చెంచు మహిళపై భౌతిక దాడికి పాల్పడిన నింధితులను కఠినంగా శిక్షించాలన్నారు. వారిపై హత్యాయత్నం, ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి బాధిత మహిళ కుటుంబానికి నష్ట పరిహారంతో పాటు వారికి చెందిన భూమిని ఇప్పించాలన్నారు. ఈ సమావేశంలో కోరం నాగేశ్వర్‌రావు, జోగ నరేందర్, జబ్బ కరుణాకర్, పాదెం జీవన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత


నగదు అందజేస్తున్న తహసీల్దార్ వీరస్వామి

మంగపేట: మండల కేంద్రంలోని వడ్డెర కాలనీకి చెందిన కుంచం పద్మ ఇల్లు గత ఏడాది కురిసన భారీ వర్షాలకు కూలిపోయి నిరాశ్రులు అయ్యారు. ప్రస్తుతం నివసించేందుకు ఇల్లు లేక ఇబ్బంది పడుతున్న విషయం తెలుసుకున్న తహసీల్దార్ బైరి వీరస్వామి మానవతా ధృక్పదంతో ఖర్చుల నిమ్మితం వ్యక్తిగతంగా రూ.4000 ఆర్థిక సాయం అందించి 50 కేజీల సన్నబియ్యం అందజేశారు. ప్రభుత్వ పరంగా న్యాయం జరిగే విధంగా చూస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ మల్లేశ్వర్‌రావు, సిబ్బంది పాల్గొన్నారు.

రామప్పలో పూజలు


పూజలు నిర్వహిస్తున్న ఎస్సైలు రాజు, వెంకటేశ్వర్లు

వెంకటాపురం(ఎం): మండలంలోని చారిత్రాత్మక రామప్ప దేవాలయాన్ని శనివారం జిల్లా కేంద్రంలో పనిచేస్తున్న చల్లా రాజు, అప్పాని వెంకటేశ్వర్లు సందర్శించారు. ఈ సందర్భంగా రామప్ప రామలింగేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వారికి ఆలయ పూజారి హరీష్‌శర్మ తీర్థప్రసాదాలు అందించి ఆశీర్వచనం చేశారు.

IN THE COURT OF THE ADDITIONAL JUNIOR CIVIL JUDGE AT JAYA SHANKAR BHUPALPALLY
Between : O.S.No. 758 of 2022
Gundipaga Babul Raju ... Plaintiff
And
Yakarapu Priyanka ... Defendant
NOTICE
To
Defendant Yakarapu Priyanka W/o. Pavan Kumar, Age: 35 Years, Occupation: Junior Assistant, R/o. Q.No.: G-82, KTPP, Chelpur Village, Ghanpur (M) Mandal, Jayashankar Bhupalpally District.
Please take notice that, the above named Plaintiff filed the above suit against you for the relief of Recovery of Money suit. As per the orders of the Hon'ble Court, the Plaintiff several times sent plaint notices to your goodself, but you are willfully avoid / evade to receive the same. As a last chance the Hon'ble Court fixed the date and time on 09-07-2024 at 10.30 a.m. for your appearance in the above suit. You must appear before the Hon'ble Court either in person or duly appointed counsel failing which, the matter will be decided in your absence on merits by setting you ex-parte.
//BY ORDER OF THE HON'BLE COURT//
Sd/- V. SRINIVASA CHARY
Advocate
H.No. 3-251, Karalmarks Colony, Bhupalpally Village and Mandal, Jayashankar Bhupalpally District. Cell: 9848852091

నేల ఆరోగ్యాన్ని కాపాడాలి


అవగాహన కల్పిస్తున్న సుజాత

రేగొండ(గోరికొత్తపల్లి): రైతులు నేల ఆరోగ్యాన్ని కాపాడేందుకు సేంద్రీయ వ్యవసాయంపై మొగ్గు చూపాలని ప్రజ్వల్ ఫార్మర్ ప్రొడ్యూసర్ కంపెనీ ప్రతినిధి సుజాత అన్నారు. శనివారం గోరికొత్తపల్లి మండలంలోని వెంకటేశ్వర్లపల్లిలో నేల ఆరోగ్యంపై రైతులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ చిగురుమామిడి రాజు, ప్రజ్వల్ డైరెక్టర్ రాజు, సంస్థ ప్రతినిధులు తిరుపతి, గీత, నారాయణదాసు, దీప, రైతులు పాల్గొన్నారు.